# అడ్డంతిరిగిన కథ

'శేషయ్యా ?'

'ప్రభూ !'

'చూశావా ?'

'ఏమిటండీ ?'

'సంస్థానాధీశులంతా ఎంత ఉదారబుద్ధితో ప్రవర్తిస్తున్నారో... ?'

'లేకపోతే మొదటికే మోసం వచ్చే పరిస్థితులొస్తున్నాయండి. ఇంతకీ మీరు చెప్పిన ఉదారబుద్ధి ఏ విషయంలో... ?'

'వెర్రి మొహమా ! చూడవోయ్ తిరువాన్కూరు, కొచ్చిన్ సంస్థానాలని... ?'

'............'

'ఇంకా అర్థంకాలా? రవి అస్తమించని మహాసామ్రాజ్యంకూడా తీసి వేయజాలక పోయిన ఉరిశిక్షలని ఈ సంస్థానాలు తీసి పారవేశాయ్-'

'మెచ్చుకోదగ్గదే నండి !'

'ఉ ! మనం ఇంకా యిలా నీళ్లు కారిపోతూ కూచున్నాం-'

'............'

'సాటి సంస్థానాల వారంతా అనేక సంస్కరణలు ప్రవేశ పెడుతూంటే-'

'మీరు చేప్పేది నాకు అర్థం కావటంలేదండి'

'ఉరిశిక్షలు-ఉరిశిక్షలు-తెలిసిందా శేషయ్యా? మనంకూడా ఉరిశిక్ష తీసి పారెయ్యాలి-'

'ప్రభూ ! ఇది అసాధ్యం-'

'శేషయ్యా ! ఏమీ అసాధ్యం కాదు.'

'ప్రభూ ! మీకు తెలీదు-'

'ఛావ్ ! అదంతా పనికిరాదు-మన సంస్థానంలో ఇంతటినుంచి ఉరి శిక్షలు లేవు-'

'ప్రభూ !'

'నోరుముయ్ ! ఇకపై నాలుగ్గంటలలోగా ఉరిశిక్షల విధానం రద్దు చేస్తున్నాం మనం-'

'ప్రభూ ! ఈపని మనం చేయలేం-'

'శేషయ్యా ! నా సంస్థానం, నా యిష్టం ! నా ప్రజలు పొరబడి ఎవర్నైనా ఖూనీచేస్తే నేను మళ్ళీ అటువంటివారి ప్రాణాలుతీసే పాపానికి వొడికట్టుకోను-'

'ప్రభూ ! మీా భూతదయ మెచ్చుకోదగ్గదే కాని-'

'ఏమిటి కానీ ? అలా చూస్తావేం ?'

ప్రభూ ! మనకి ఉరిశిక్ష విధించే హక్కే లేనప్పుడు... ?'

'ఏమిటీ అంటున్నావ్ ?? శేషయ్యా, ఏమిటీ అంటున్నావ్ ?'

'మనకి ఉరిశిక్ష విధించే హక్కు లేదంటున్నానండి. ఆ హక్కు ఉండేటంత పెద్ద సంస్థానం కాదండి మన్ది-'

'అయితే మన సంస్థానంలో ఉరి తీయబడేవారంతా ఎవరిచేత తీయబడుతున్నారూ ?'

'ప్రభుత్వంవారి జడ్జీలచేతనండి-'

'ఏ ప్రభుత్వం ?'

'మనపైన వుండే ప్రభుత్వమండి-'

'గవర్నరూ, వైస్రాయీ వాళ్లా ?'

'చిత్తం-చిత్తం !'

'అయితే మనం తల్చుకుంటే ఉరిశిక్షలని రద్దుచేయించలేం మన సంస్థానంలో ?'

'శిక్ష విధించే హక్కే మనకి లేనప్పుడు దాన్ని రద్దుచేసే హక్కు మనకెక్కడిదండీ ?'

'శేషయ్యా ! నువు వెంటనే ఓ పిటీషను పెట్టు వైస్రాయికి-?'

'ఏమనండి ?'

'మనకి ఉరిశిక్ష విధించే హక్కు కావాలని !'